# ఫెంగ్ షుయి



## వాడిన పూలు వికసించవు!

పూలు సువాసనకే కాదు అందానికి, సౌకుమార్యానికీ ప్రతీకలు. పూలను ఇష్టపడని వారుండరు. ఎవరినైనా పెద్దలను కలిసేందుకు వెళ్లినప్పుడు పూల బొకేలు తీసుకెళ్తుంటాం. మిత్రులకు పుట్టిన రోజు శుభాకాంక్షల్లో, పెళ్లి రోజు శుభాకాంక్షల్లో చెప్పాలన్నా పూలుండాల్సిందే. పిల్లలకు తలలు దువ్వి పూల జడలు అల్లడం అమ్మలకు ఓ సరదా. ఆఫీసులనుంచి వస్తూ వస్తూ ఇళ్లకు పూలు తీసుకుపోవడం మగవారికి ఓ అలవాటు. హిందూ సంప్రదాయంలో ఏ శుభకార్యం జరిగినా పూలు తప్పనిసరి. అంతగా మన జీవితాలతో పూల సంబంధాలు పెనవేసుకుపోయాయి.

తాజా పూలను ఇంట్లో అలంకరిస్తే మంచిది. వికసించిన తాజా పూలు సంతోషానికీ, ఉత్సాహానికి ప్రతీకలు. అయితే చాలామంది ఇళ్లలో పూలను అలంకరిస్తారు కానీ, అవి వాడిపోయాక తీసివేయడంలో బద్ధకిస్తారు. ఇది ఆ కుటుంబానికి హాని చేస్తుంది. ఇంట్లో ఎప్పుడూ తాజా పూలే ఉండాలి. వాడిపోయిన లేదా, ఎండిపోయిన పూలు ఇంట్లో ఉండరాదు. ఎండిన పూలనుంచి చెడుశక్తి వెలువడుతుంది. ఇది ఇంట్లోని మనుషుల ఆలోచనా సరళిపై దుష్ప్రభావాన్ని చూపుతుంది. మనకెంతటి ఆత్మీయులున్నా సరే, వారు చనిపోయాక మృతదేహాన్ని ఇంట్లో ఉంచము! అలాగే వాడిపోయిన పూలను కూడా ఇంట్లోంచి తొలగించాలి. అయితే రోజూ తాజా పూలను కొని ఇంట్లో అలంకరించుకోవడం అన్నది ఖర్చుతో కూడుకున్న పని. అలాంటి సందర్భాల్లో తాజా పూలకు బదులు ప్లాస్టిక్‌పూలను ఇంట్లో అలంకరించుకోవచ్చు. సిల్కుతో చేసిన పూలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. అంతేకానీ ఎట్టి పరిస్థితిలోనూ ఇంట్లో ఎండిపోయిన పూలను మాత్రం ఉంచుకోరాదు.

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

# 'సరసి' కత

వైశంపాయనుడు కొంతకాలం ఓ అపార్టుమెంటులో ఉండేవాడు. ఎనిమిది అంతస్థులున్న ఆ అపార్టుమెంటుకి లిఫ్టు సౌకర్యం ఉంది. ఓసారి ఆ లిఫ్టు సగం పాడైంది. పాడయ్యాక అది మనుషుల్ని కింది నుంచి పైకి తీసుకెళ్లడం మానేసి, పైనించి కిందకు మాత్రమే తీసుకొచ్చేది. ఒక్కరెక్కినా పైకి కదిలేదు కాదు. కాని ఎంతమంది ఎక్కినా పైనించి కిందకు మాత్రం తీసుకొచ్చేది! ఆ అపార్టుమెంటు వాళ్లందరూ దానికి శాపనార్థాలు పెడుతూ ఇబ్బందిపడుతూ అన్ని ఫ్లోర్లూ ఎక్కడానికే సాహసిస్తున్నారు గానీ, రిపేరు చేయించడానికి మాత్రం ముందుకు రావట్లేదు. వస్తే, డబ్బులు వేసుకోవాలని భయం.

వైశంపాయనుడుకి ఓసారి వొళ్లు పాడైంది. ఏనుగులాంటి మనిషి పీనుగులా అయ్యాడు. భార్య సుబ్బాయమ్మ చుట్టాలతో కలిసి యాత్రల కెళ్లింది. ఆ రోజు డాక్టరు దగ్గర




## పిల్లి చేసిన మేలు

కెళ్లాల్సివచ్చి, లేని ఓపిక తెచ్చుకుని, లిఫ్టు సహాయంతో కిందకి దిగేడు వైశంపాయనుడు. దిగగానే ఎదురుగా కనిపించిం దొక నల్ల పిల్లి!! ''ఛస్!'' అని బూతులు తిట్టేడు. ''ఈ రోజు బ్లడ్ టెస్టు రిపోర్టు వస్తుంది. ఈ దుశ్శ కునాన్ని ఖాతరు చెయ్యకుండా ముందుకెడితే ఆ రిపోర్టులో ఏ క్యాన్సరనో రావచ్చు! వెనక్కెళ్లి, కాళ్లు కడుక్కుని కాసేపున్నాక బయల్దేరితే దోషం ఉండదట. అయితే ఇప్పుడు చచ్చినట్టు ఎనిమిదంతస్తులు ఎక్కాలి'' అనుకుంటూ చచ్చినట్టే ఎక్కేడు. ఎక్కేక చచ్చినట్టయ్యి పూర్వీకులంతా కళ్లకి కనిపించారు!

జ్వరం తగ్గి కొద్ది రోజులకి కుదటపడ్డాక వైశంపాయనుడు చేసిన మొట్టమొదటి పని – అపార్టు మెంటులో వాళ్లందరినీ కూర్చోబెట్టి, అందరం వేసుకుంటే ఎక్కువ ఖర్చు కాదని వాళ్లకి నచ్చ చెప్పి, లిఫ్టు బాగు చేయించడం!!

ఆ రోజు పిల్లి ఎదురవ్వబట్టే ఇంత మంచి పని జరిగింది కాబట్టి, 'పిల్లి చేసిన మేలు తల్లి కూడా చెయ్యదు' అని కొత్త సామెత కనిపెట్టాడు వైశంపాయనుడు.

❑